వివరాలు పక్కాగా సేకరించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేపై శిక్షణ

కలెక్టరేట్, అక్టోబర్ 29: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)పై జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి సర్వే మొదలుకానుందని తెలిపారు. మాస్టర్ ట్రెయినర్లు తమ పరిధిలోని ఎన్యుమరేటర్లకు సర్వే సందర్భంగా తీసుకోవాల్సిన వివరాలు, వాటిని నిర్ణీత ఫారాల్లో నింపాలని సూచించారు. ప్రతి అంశానికి సంబంధించిన అన్ని బుక్‌లెట్‌లో ఉన్నాయని, వాటికి అనుగుణంగా నిర్ణీత ఫారాల్లో కోడ్స్ వేయాలని తెలిపారు. సర్వే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి జిల్లా ప్రణాళికాధికారి శ్రీనివాసచారి వివరించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ఖీమ్యానాయక్, జడ్పీసీఈవో వినోద్‌కుమార్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, డీపీవో శేషాద్రి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రాధాభాయ్ పాల్గొన్నారు.

సర్వేపై వీసీ ద్వారా సమీక్ష

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విక్రమార్క మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సర్వే నిర్వహణకు తయారు చేసిన ప్రణాళిక, సర్వే ఉద్దేశం, జిల్లా స్థాయిలో కలెక్టర్లు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. సర్వే నిర్వహణకు ప్రతి మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారులు నోడల్ అధికారిగా నియమించాలన్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ హాజరయ్యారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఆయాశాఖల అధికారులు

డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల

జిల్లాలో 4,75,064మంది ఓటర్ల వివరాలతో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1 జనవరి 2025 నాటికి 18ఏండ్లు పూర్తి చేసుకున్న వారి వివరాలతో డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేశామన్నారు. వేములవాడ నియోజకవర్గంలో మొత్తం 2,27,575 మంది, సిరిసిల్ల నియోజకవర్గంలో 2,47,489మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,28,745 మంది పురుషులు, 2,46,114మంది స్త్రీలు, 37మంది ఇతరులు, మరో 161మంది పురుషులు, ఏడుగురు మహిళలు సర్వీస్ ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. 18 ఏండ్లు నిండినవారు తమ పేర్లను డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో చెక్ చేసుకోవాలని, లేనిపక్షంలో నవంబర్ 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 9, 10 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేస్తామని, వీటిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమరవీరుల త్యాగం మరువద్దు: ఎస్పీ

కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణచౌక్, అక్టోబర్ 29: శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులను మరువద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని నేతన్నచౌరస్తా నుంచి అంబేద్కర్‌చౌరస్తా మీదుగా గాంధీ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఇక్కడ అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు కృష్ణ, మొగిలి, వీరప్రసాద్, శ్రీనివాస్, ఆర్‌ఐలు రమేశ్, యాదగిరి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురి రిమాండ్

తెలంగాణచౌక్, అక్టోబర్29: గంజాయి తరలింపు కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరిసిల్ల అంబేద్కర్‌నగర్‌కు చెందిన సదిమెల అభినయ్, రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంతి సాగర్ గణేశ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన జోయేల్ వంశీ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై గంజాయికి అలవాటుపడినట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా వారి వద్ద నుంచి 440గ్రామల గంజాయి, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

అక్రమంగా పటాకులు నిల్వచేసిన వ్యక్తిపై కేసు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్29: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అడ్డగట్ల ప్రవీణ్ అనుమతి లేకుండా పటాకులు నిల్వ చేసి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు సోదాలు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. రూ.74,310 విలువైన పటాకులు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వీర్నపల్లి, అక్టోబర్29: గర్జనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కేంద్ర వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో వైద్యుడు పత్తిపాక శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ సాయిచంద్ర విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఇక్కడ ఉపాధ్యాయులు ఉమారాణి, బలరాంనాయక్, శ్రీనివాస్, కవిత, తదితరులు ఉన్నారు.

1న బీసీ కమిషన్ బృందం రాక

కలెక్టరేట్, అక్టోబర్29: స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దమాషాను పేర్కొనే విషయంలో రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 1న కరీంనగర్‌కు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజన్నసిరిసిల్ల, కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 1న కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 4గంటల వరకు చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ తీసుకుంటుందన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వేములవాడ, అక్టోబర్ 29: ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఫీర్ మహ్మద్ సోదరి సాబేరాబేగం మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ మహేశ్, అక్రమ్ ఉన్నారు.

వేములవాడ, అక్టోబర్ 29: రాజన్న ఆలయ పర్యవేక్షకుడు రామచందర్‌రావు ఇటీవల మృతిచెందగా, ఆయన కుమారులు రాజేశ్, రాకేశ్‌ను బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట వెంగళ శ్రీకాంత్‌గౌడ్, వెంకటేశం ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

వీర్నపల్లి, అక్టోబర్29: ఏఎంసీ చైర్మన్ లాకవత్ రాములునాయక్, వైస్‌చైర్మన్ లెంకల లక్ష్మణ్, డైరెక్టర్ పని నర్సింగంను అడవిపదిర గ్రామస్తులు మంగళవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సన్మానించారు. ఇక్కడ భాస్కర్, తిరుపతిరెడ్డి, బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

టీబీని పూర్తిగా అరికట్టడమే లక్ష్యం

వరదవెల్లిలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వసంతరావు

బోయినపల్లి, అక్టోబర్ 29: టీబీని 2025 ఏడాది చివరి నాటికి పూర్తిగా అరికట్టడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వసంతరావు పేర్కొన్నారు. మంగళవారం వరదవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్, జిల్లా క్షయ వ్యాధి నివారణ సంస్థ వారి ఆధ్వర్యంలో టీబీ చాం పియన్లకు ఒకరోజు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. టీబీని పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ట్రీట్‌మెంట్ తీసుకుని టీబీని జయించిన వారు కూడా సహకరించి టీబీ వచ్చిన వారికి మనోధైర్యం కల్పించాలన్నారు. జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన అధికారి డా రాజగోపాల్ మాట్లాడుతూ, టీబీని అరికట్టడం అందరి బాధ్యత అని, వ్యాధిపై ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టాలన్నారు. రోగులకు అండగా నిలిచి మనోధైర్యం కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ సంబ గంగాధర్‌ను వైద్యాధికారులు అభినందించారు. ఇక్కడ కొదురుపాక పీహెచ్‌సీ వైద్యురాలు రేణు ప్రియాంక, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ప్రోగ్రాం మేనేజర్ జీ రవీందర్, డాక్టర్ వినూత్న, ఎన్ బిగేందర్, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎస్ గంగాధర్, సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

చోరీ కేసులో ఏడాదిన్నర జైలు

గాంధీ చౌక్, అక్టోబర్ 29: చోరీ కేసులో ఒకరికి ఏడాదిన్నర జైలుశిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ముస్తాబాద్‌లో బకెట్ బిర్యానీ హోటల్ యజమాని తన్నీరు నరేందర్‌రావు 17 ఆగస్టు 2023న తన హోటల్ ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి బైక్ దొంగలించిన దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన పంజా చందును రిమాండ్‌కు తరలించారు. అప్పటి ఎస్ఐ శేఖర్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ కేసును వాదించారు. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ దేవేందర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మేజిస్ట్రేట్ చందుకు ఏడాదిన్నర జైలుశిక్షతోపాటు రూ.100 జరిమానా విధించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వేములవాడ రూరల్, అక్టోబర్ 29: నూకలమర్రి ఉన్నత పాఠశాలకు చెందిన పాలకుర్తి సుదీక్ష రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం బూర సదానందం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని సుదీక్షతోపాటు వ్యాయామ టీచర్ జ్యోతిని మాజీ సర్పంచ్ వకుళాభరణం శ్రీనివాస్, బొడ్డు దేవయ్య, చైతన్య యూత్ క్లబ్ అధ్యక్షుడు కిశోర్ అభినందించారు. నవంబర్ 3, 4, 5తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సుదీక్ష పాల్గొననున్నట్లు వారు వెల్లడించారు. ఇక్కడ ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్, మహేశ్, స్వామి, పుష్పలత, జ్యోతి, యుగేందర్, జయశ్రీ, గణేశ్ ఉన్నారు.

కోనరావుపేట, అక్టోబర్ 29: నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రోహిత్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 8న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రోహిత్‌ను హెచ్‌ఎం షాబుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్ అభినందించారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, అక్టోబర్ 29: నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో మండల నాయీబ్రాహ్మణ సంఘం, మండల మున్నూరుకాపు సంఘం నిర్మాణాలకు భూమిపూజ చేసి, బోర్‌మోటర్‌ను ప్రారంభించారు. తెనుగువానిపల్లిలో ముదిరాజ్ సంఘ భవనాన్ని ప్రారంభించారు. తర్వాత అనంతగిరి, వంతడుపుల, జవారుపేట, గాలిపెల్లి, ముస్కానిపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇక్కడ ఎంపీడీవో శశికళ, ఎంపీవో శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ చైతన్య, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నేతలు, మున్నూరుకాపు, నాయీబ్రాహ్మణ సంఘం నేతలు ఉన్నారు.

క్రిబ్‌కో సభ్యులుగా ఉమ్మడి జిల్లా చైర్మన్లు

కొండూరి రవీందర్‌రావుతో పీఏసీఎస్ చైర్మన్లు

గంభీరావుపేట, అక్టోబర్ 29: క్రిబ్‌కో ఎరువుల కంపెనీ రిప్రెసెంటివ్ జనరల్ బాడీ సభ్యులుగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ఐదు సహకార సంఘాల చైర్మన్లు ఎన్నికయ్యారు. గంభీరావుపేట చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతోపాటు పోరండ్ల చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి, అల్మాస్‌పూర్ చైర్మన్ ఉచ్చిడి మోహన్‌రెడ్డి, చొప్పదండి చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, కల్లెడ చైర్మన్ సందీప్‌రావు ఎన్నికయ్యారు. వీరిని స్టేట్‌మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణయ్య అభినందించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కలెక్టరేట్, అక్టోబర్ 29: రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. వానకాలం 2024-25 సీజన్‌లో ధాన్యం కొనుగోలు విధివిధానాలపై అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారులు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రెండు మూడు రోజుల్లో జిల్లాల్లో ఉన్న మొత్తం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలన్నారు. సన్నరకం ధాన్యానికి ₹500 బోనస్ అందించాలన్నారు. ఇక్కడ అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఖీమ్యానాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి పీ వసంతలక్ష్మి, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల సంస్థ రజిత, డీటీలు ఉన్నారు.

రైతుల గోసను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

రగుడులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 29: రైతుల గోసను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. అందుకే వారు ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు పోచవేని ఎల్లయ్యయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన రగుడు ఒకటో వార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను పట్టించుకోకపోవడంతో రైతులు దళారులకు ధాన్యం విక్రయిస్తూ నష్టపోతున్నారని ఆవేదన చెందారు. ఇప్పటివరకు వడ్లు కొనుగోలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ నేతలు బూర తిరుపతి, బూర కమలాకర్, మాస అనిల్, రామస్వామి, రాములు, మధు, లింగం, నాగరాజు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరణపై హర్షం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 29: విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం ఉపసంహరణ, విద్యుత్ సబ్సిడీ 10 హెచ్‌పీ నుంచి 25 హెచ్‌పీలకు వర్తింపజేస్తూ వెల్లడించిన ఈఆర్‌సీ ప్రకటనను స్వాగతిస్తూ బీఆర్ ఎస్‌కేవీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటానికి కార్మికులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు పోరండ్ల రమేశ్, నేతలు వేముల చెన్నయ్య, విష్ణు, తాటి వెంకన్న, బాబి, ఉడుత హన్మాండ్లు, కనకయ్య, తదితరులు ఉన్నారు.

ప్రారంభాలకే కేంద్రాలు పరిమితం

ఇల్లంతకుంట, అక్టోబర్ 29: మండలంలోని పలు గ్రామాల్లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించిన 19వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభ దశలోనే ఆగిపోయాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ గౌడుగు తిరుపతి మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ సమయానికి సగం ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం అయ్యేలా చూడాలన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న వైస్ చైర్మన్ తిరుపతి

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, Nagarapu Gangadhar S/o. Nagarapu Nadipi Gangaram (Old Name) H.No. 8-51/68, Rudrangi Rajanna Sircilla Dist. TS. My Surname was Changed To Nagaram Gangadhar S/o. Nagaram Nadipi Gangaram (New Name)
NTK-00000

కావలెను

★కరీంనగర్ ప్రశాంత్‌నగర్ లోని హిమాలయ మినరల్ వాటర్ ప్లాంట్‌లో పనిచేయుటకు డ్రైవర్లు మరియు హెల్పర్లు (M/F) కావలెను. భోజనం+వసతి కల్పించబడును. సంప్ర|| సెల్: 7981054327, 7093413912
NTK-335404

పాస్‌పోర్ట్ పోయినది

★పురుమల్ల పూర్ణిమ S/o సత్తయ్య, H.No. 9-9-154/1, శ్రీహరినగర్, రోడ్ నెం.3, రాంనగర్, కరీంనగర్ మం|| & జి|| నా యొక్క పాస్‌పోర్టు నెం|| N8546133 రామ్‌నగర్ నుండి గీతాభవన్ వెళ్ళుచుండగా పోయినది. దొరికిన వారు సంప్ర|| 9440568299
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వివాహిత బలవన్మరణం

చందుర్తి, అక్టోబర్ 29: అదనపు వరకట్నం వేధింపులు తాళలేక ఓ వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. బోయినపల్లి మండలం జగ్గారావుపల్లికి చెందిన కొంపెల్లి అపర్ణ(27)కు చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన ఆరెల్లి శంకర్‌తో వివాహం కాగా, వీరికి కొడుకు అనిరుధ్, కూతురు విశాన్వి ఉన్నారు. అయితే అపర్ణ-శంకర్ పెండ్లి సమయంలో రూ.2లక్షల కట్నంతోపాటు ఇతర లాంఛనాలు ఇచ్చారు. ద్విచక్రవాహనం ఇవ్వాల్సి ఉండగా ఆర్థిక ఇబ్బందులతో ఇవ్వలేకపోయారు. ఆరు నెలల నుంచి ద్విచక్ర వాహనంతోపాటు, అదనంగా మరో లక్ష రూపాయలు కట్నం తేవాలని అపర్ణను భర్త శంకర్, అత్తామామలు లచ్చవ్వ-రాజయ్య వేధింపులకు గురిచేసేవారు. రెండుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. మంగళవారం మరోసారి భర్త, అత్తామామలు వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన అపర్ణ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. అపర్ణ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ బాబు తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 29: సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని బుధవారం కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం అనంతరం చైర్‌పర్సన్ తన చాంబర్‌లో పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తారని తెలిపారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

చందుర్తి, అక్టోబర్ 29: కిష్టంపేటలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం షీటీం ఆధ్వర్యంలో గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ప్రమీల మాట్లాడుతూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఫోక్సో యాక్ట్, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ హెచ్‌ఎం అన్నాడి రజిత, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, విద్యార్థులు ఉన్నారు.

కానిస్టేబుల్‌కు సేవా పురస్కార్

వేములవాడరూరల్, అక్టోబర్29: వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజశేఖర్‌కు జాతీయస్థాయి యంగ్ ఇండియాన్ సేవాపురస్కార్ అవార్డు వరించింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందించిన యంగ్ ఇండియా బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు, యువ ఫౌండేషన్ అభ్యర్థులకు కానిస్టేబుల్ రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 29: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నిబంధనలను స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజలి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు స్కానింగ్ కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో సందర్శించారు. స్కానింగ్ పరీక్షలు రేడియాలజిస్ట్, గైనకాలజిస్ట్ పర్యవేక్షణలో చేయాలన్నారు. ఇక్కడ డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, హెచ్ఈ బాలయ్య ఉన్నారు.

ఘాట్ రోడ్డు పనులు వారంలోగా ప్రారంభించాలి

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

ఘాట్ రోడ్డును పరిశీలిస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

కోనరావుపేట, అక్టోబర్ 29: నిలిచిపోయిన ఘాట్ రోడ్డు పనులు వారంలోగా ప్రారంభించాలని వేములవాడ ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సూచించారు. వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ దేవాలయమైన మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేయగా, అర్చకులు తిరునహరి కృష్ణ, లక్ష్మణ్ వేదామంత్రోచ్చరణాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని ఆలయ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ప్రధానంగా మధ్యలోనే నిలిచిపోయిన ఆలయ ఘాట్ రోడ్డును పరిశీలించి, రోడ్డు పనులు వారంలోగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సదరు కాంట్రాక్టు పనులు వేగవంతం చేసి.. వచ్చే మాఘ అమావాస్య వరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. పచ్చని గుట్టల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఈ ఆలయాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లేందుకు అన్నివిధాలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వేణుగోపాలస్వా మి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఇక్కడ ఈఈ రాజేశ్, డీఈ మహిపాల్‌రెడ్డి, ఆలయ ఇన్‌చార్జి నరేందర్, ఏఈ రామకిషన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, సిబ్బంది ఉన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

ఓటుగా నమోదు చేసుకుంటున్న సెస్ చైర్మన్ చిక్కాల

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు సూచించారు. మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో చిక్కాల ఓటరుగా నమోదు చేసుకున్నారు. చాలా మంది పట్టభద్రులంతా ముందుకు వచ్చి ఓటరుగా నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్న మానేరు స్వచ్ఛంద సంస్థ చైర్మన్ చింతోజు భాస్కర్‌ను అభినందించారు.

ఎల్ఆర్ఎస్‌పై ఆందోళనలు చేస్తాం

వేములవాడ, అక్టోబర్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై ప్రజలను వేధిస్తున్నందున పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశం ఏజెండా అనంతరం కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలను మళ్లీ ఎల్ఆర్ఎస్ పేరుతో వేధిస్తున్నదని మండిపడ్డారు. ప్రతిరోజు వార్డు అధికారులు ప్రజలను వేధిస్తున్నారని.. తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ గోలి మహేశ్ మాట్లాడుతూ, కోట్లాది రూపాయలతో నిర్మించిన సమీకృత మార్కెట్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరారు. కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ మాట్లాడుతూ, వీధి కుక్కలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నియంత్రణకు కమిటీ వేయాలని సూచించారు. ఇక్కడ కమిషనర్ సంపత్‌రెడ్డి, వైస్ చైర్మన్ బింగి మహేశ్, డీఈ వరుణ్, ఏఈ నరసింహస్వామి, అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు.

రైతులు మన్నించాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 29: వరి ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమైనందున రైతులు మన్నించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య వేడుకున్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్‌మిల్లులు మిల్లింగ్ చార్జీలు ఇవ్వలేదని, వారితో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఇక్కడ నాయకుడు గౌస్, తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించాలి

బోయినపల్లి, అక్టోబర్ 29: రైతులందరూ ఆయిల్‌పామ్ సాగుపై దృష్టిసారించాలని ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి లత సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొదురుపాక రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్ అనంతరం ఆమె మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఉంటాయని చెప్పారు. అదే విధంగా యాసంగిలో పంటల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇక్కడ ఏవో ప్రణీత, ఏఈవోలు శ్రీదేవి, రవళి, లక్ష్మణ్, అనూష, తదితరులు ఉన్నారు.

సంఘాలు-కార్యవర్గాలు

కోనరావుపేట, అక్టోబర్ 29: సుద్దాలకు చెందిన మాసం అన్వేష్ కేటీఆర్ సేన మండలాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాడు. అన్వేష్ మాట్లాడుతూ అధికార పార్టీ ఇచ్చిన హామీలను నిలదీస్తూ, రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేస్తానన్నారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేవరకు కేటీఆర్ సేన తరుపున పోరాడుతామని తెలిపారు ఇక్కడ కేటీఆర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, మహిళా జిల్లా నాయకురాలు కుర్ర సావిత్రి, కోడె శ్రీనివాస్, వినయ్, పొట్లపల్లి కిషన్, ఆవునూరి నవీన్, తదితరులు ఉన్నారు.

కోనరావుపేట, అక్టోబర్ 29: మామిడిపల్లికి చెందిన బుర్ర లక్ష్మణ్ బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ మండలాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్, జిల్లా అధ్యక్షుడు కొక్కుల ప్రసాద్ చేతులమీదుగా మంగళవారం నియమాక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

విరిగిన చెట్టు.. నిలిచిన రాకపోకలు

మామిడిపల్లి శివారులో మంగళవారం ఉదయం తుమ్మ చెట్టు విరిగి రోడ్డుపై అడ్డంగా పడింది. ఈ మార్గం వేములవాడకు వెళ్లే ప్రధాన రోడ్డు కావడం తో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం వరకు కూడా చెట్టును తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. వేములవాడ నుంచి మరిమడ్లకు సాయంత్రం వేళలో వచ్చిన ఆర్టీసీ బస్సు మామిడిపల్లి శివారు వరకే వచ్చి తిరిగి వెళ్లిపోయింది. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు నడుచుకుంటూ ఇంటికి చేరుకున్నారు. కాగా, రాత్రివేళలో గ్రామస్తులు చెట్టును తొలగించారు.

– కోనరావుపేట, అక్టోబర్ 29

రోడ్డు మీద విరిగిపడిన చెట్టు

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

డీసీవోకు అవిశ్వాస పత్రం అందజేస్తున్న వైస్ చైర్మన్, డైరెక్టర్లు

ముస్తాబాద్, అక్టోబర్ 29: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డిపై కొంత మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. పలు అంశాలపై చైర్మన్ సరైన సమాధానం తెలుపడం లేదంటూ మంగళవారం కొంతమంది డైరెక్టర్లు జిల్లా కేంద్రంలోని ఆఫీస్ జిల్లా సహకార అధికారి రామకృష్ణ అవిశ్వాస తీర్మాన పత్రం అందజేశారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

ముస్తాబాద్, అక్టోబర్ 29: చిప్పలపల్లిలో మంగళవారం అకాల వర్షం పడడంతో ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి15రోజులు అవుతున్నప్పటికీ.. కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లు చేపట్టాలని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొమ్మెట రాజమల్లు కోరారు.